

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08




# ప్రతిష్టాత్మకంగా సీఎం పర్యటన ఏర్పాట్లు

### భద్రత, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### పర్యటన ప్రాంతాలను పరిశీలించిన సీఎం భద్రతాధికారులు

### కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్





**నాగర్‌కర్నూల్, అక్షిత బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం, వంగూరు మండలంలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో నిర్వహించే దసరా వేడుకల్లో పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పర్యటన ఏర్పాట్లను పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రత, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, సోమవారం కొండారెడ్డిపల్లిని సందర్శించి పర్యటన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కొండారెడ్డిపల్లిలో దసరా వేడుకల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కట్ట మైసమ్మ దేవాలయం, ఆంజనేయ స్వామి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ..మిగతా 2లో



# సాగు నీరివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడి

### జూపల్లి సొంత మండలంలోనే రైతుల కంటతడి

### జూరాల నీరు రాక మండలంలో అనేక ఎకరాల మినుము పంట నష్టం

### మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



**చిన్నంబావి, అక్షిత న్యూస్:** చిన్నంబావి మండలం పెద్దదగడ, లక్ష్మీపల్లి గ్రామాలకు చెందిన రైతు జంపుల బోరింగ్ రంగయ్య సాగు చేసిన నాలుగు ఎకరాల మినుము పంట పూర్తిగా ఎండిపోవడంతో కన్నీటిపర్యంతమయ్యారు. ఎండిన పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, బాధిత రైతులకు ఎకరాకు ..మిగతా 2లో

# వెట్టి చాకిరి కట్టడికి సమష్టి కృషి

### కార్మికుల హక్కులపై విస్తృత అవగాహన కల్పించాలి

### స్వేచ్ఛా రథం' ప్రారంభించిన కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** వెట్టి చాకిరి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కార్మికుల హక్కులు, చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. వెట్టి చాకిరి రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వ శాఖలన్నీ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వెట్టి చాకిరి నిర్మూలనతో పాటు కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన 'స్వేచ్ఛా రథం' ..మిగతా 2లో

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారులతో కలిసి ప్రజల నుంచి 44 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా కరీంనగర్ నగరపాలికకు 19 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సోమవారం కల్లా శాఖల లాగిన్‌లో ఉన్న ప్రజావాణి ..మిగతా 2లో



www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY

మంగళవారం |20| అక్టోబర్ | 2026

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి...**

దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.వచ్చే సోమవారం నుంచి మొదటి గంటలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని.. ఈ లోగా అధికారులు లాగిన్ లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సూపరింటెశీడెంట్లు ఖాళీ చరణ్, మాధవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి కట్టడికి సమష్టి కృషి

**మొదటి పేజీ తరువాయి...**

ప్రచార వాహనాన్ని సోమవారం నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టి చాకిరి వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు అమలులో ఉన్న చట్టాలు, కార్మికులకు కల్పించిన హక్కులపై నాటికలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

**అసంఘటిత కార్మికులే లక్ష్యంగా ప్రచారం**

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించే స్వేచ్ఛా రథం ద్వారా వ్యవసాయ రంగం, ఇటుక బట్టీలు, మైనింగ్, క్వారీలతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు వారి హక్కులపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వెట్టి చాకిరికి గురైన బాధితులు, అలాంటి ఘటనలను గుర్తించిన వారు నిర్భయంగా ఫిర్యాదు చేసేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పేర్కొన్నారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343ను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం వెట్టి చాకిరి నిర్మూలనకు సంబంధించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, కార్మిక శాఖ అధికారి రాజలింగం, ప్రచార రథం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేట మండలంలో ఎల్‌నినోపై గ్రామసభలు

**ఈ నెల 22 నుంచి 31 వరకు గ్రామాల వారీగా సమావేశాలు.. రైతులకు అవగాహన కల్పించనున్న అధికారులు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఎల్‌నినో ప్రభావం, రాబోయే రబీ సీజన్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించేలా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) షెడ్యూల్‌ను విడుదల చేశారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించనున్నారు. గ్రామసభల్లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో సంభవించే మార్పులు, వర్షపాతం పరిస్థితులు, రబీ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల వినియోగం, పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ సమావేశాలకు ఆయా గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు హాజరై ఎల్‌నినో ప్రభావం, రబీ సాగు ప్రణాళికపై చర్చించాలని అధికారులు సూచించారు. రైతులు గ్రామసభల్లో పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన సూచనలు, సలహాలు తెలుసుకోవాలని కోరారు.

# సాగు నీరివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడి

**మొదటి పేజీ తరువాయి...**



రూ.లక్ష పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.....వందల ఎకరాల్లో పంటలు ఎండిపోవడంతో రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి, దిగుబడి చేతికొచ్చే సమయంలో నీరు, విద్యుత్ అందక రైతులు తీవ్రంగా నష్టపోయారని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గోపాల్దిన్నె--సింగోటం లింక్ కెనాల్ పనులను ప్రారంభించామని, అవి పూర్తయి ఉంటే రైతులకు సాగునీరు అందేదని అన్నారు.

**మంత్రి జూపల్లి కృష్ణారావు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు**

కొల్లాపూర్ నియోజక వర్గంలో ఎక్కడ చూసినా ఎండిపోయిన పంటలే కనిపిస్తున్నాయని పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతు తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకోవడంతో బీరం హర్షవర్ధన్ రెడ్డి సైతం భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకుని, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ఆరుతడి పంటలకు నీళ్లు ఇస్తారని నమ్మకంతో కౌలు భూమి వేసుకొని వడ్డీలకు లక్షలు పెట్టుబడి పెట్టి తెచ్చి అప్పుల పాలయ్యాను. కనీసం ఉండడానికి కూడా ఇల్లు లేదు ఉన్న పాత ఇల్లు శిథిలా వ్యవస్థకు చేరింది. ఇందిరమ్మ ఇల్లు అడుగుతే పార్టీ కండువా కప్పుకుంటేనే చెప్తున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. పంట పండుతే ఇల్లు కట్టుకుని కూతురు పెళ్లి చేద్దామనుకున్నా రేవంత్ ప్రభుత్వ సాగునీరు ఇవ్వకుండా అప్పులపాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. దేవుడికి అక్షంతలు వేయడానికి కూడా కాంగ్రెస్ పాలనలో పండేటట్లు లేవు మహిళా రైతు ఆవేదన. దేవుడికి బదులు కేసీఆర్ మొక్కాలి మాట ఇచ్చాడంటే రైతుబంధు అనుకున్న సమయంలో వచ్చేవి. సొంతం మండలానికి సొంత గ్రామానికి నీళ్లు లేవు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ మండల అధ్యక్షుడు గజ్జల ఈదన్న, మహేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేమాన్ రామకృష్ణ, సంపంగి మద్దిలేటి బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా సీఎం పర్యటన ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి...**

సాయంత్రం దసరా సంప్రదాయంలో భాగంగా గ్రామ సరిహద్దులో ఉన్న జమ్మి చెట్టు వద్దకు పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఆయా ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి భద్రతాధికారులు, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఐడబ్ల్యూఓ ఎస్పీ రామ్ చందర్ తదితరులు కొండారెడ్డిపల్లిలో ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆలయాలు, జమ్మి చెట్టు వద్ద నిర్వహించనున్న కార్యక్రమాల ప్రదేశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, వాహనాల రాకపోకల నిర్వహణ, ప్రజల రాకపోకలకు అవసరమైన మార్గాలు, కార్యక్రమాల ప్రాంగణాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించి, పూర్తిచేయాల్సిన పనులపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన



ముఖ్యమంత్రి పర్యటన భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవ సహాయం,తదితరులతో కలిసి వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు.ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, ఏర్పాట్ల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. పర్యటనకు అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయడంతోపాటు, వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి భద్రతాధికారులు సూచించారు.సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లతోపాటు పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రవాణా సదుపాయాలు, పర్యటన ప్రాంతాల పరిశుభ్రత, కార్యక్రమాల ప్రాంగణాల సిద్ధతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.గ్రామానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, చేపట్టిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌కు, సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏవైనా లోటుపాట్లు గుర్తిస్తే తక్షణమే సరిదిద్దాలని కలెక్టర్ ఆదేశించారు.

అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి భద్రత అధికారి శ్రీధర్ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,

మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# "అంతిమ యాత్ర - ఆఖరి సఫర్" పథకంపై
# సమగ్ర విచారణ జరిపించాలి

**పేద కుటుంబాలకు అందాల్సిన అంత్యక్రియల సేవల్లో పారదర్శకతే ప్రామాణికం**

**జిల్లా కలెక్టర్‌కు బండి శ్రీనివాస్ శ్రీ సన్ ఫిర్యాదు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కుటుంబ సభ్యుడిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న పేద కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో ఆర్థిక భారం తగ్గించి, గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న "అంతిమ యాత్ర -- ఆఖరి సఫర్" పథకం అమలు తీరుపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని భారతీయ నవజీవన్ పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బండి శ్రీనివాస్ శ్రీ సన్ కోరారు. ఈ మేరకు ఆయన కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు సమర్పించి, పథకం అమలుకు సంబంధించిన రికార్డులు, సేవల వివరాలు, బిల్లులు, చెల్లింపులను నిష్పక్షపాతంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. పేదల కోసం రూపొందించిన పథకం పేదలకు సంపూర్ణంగా ఉపయోగపడాలి.

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అమలవుతున్న ఈ పథకం ఉద్దేశం కేవలం అంత్యక్రియల సేవలు అందించడమే కాకుండా, ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే కుటుంబాలకు అండగా నిలవడం కూడా అని బండి శ్రీనివాస్ శ్రీ సన్ పేర్కొన్నారు. ప్రజాధనంతో అమలయ్యే సంక్షేమ పథకాలలో నిర్దేశించిన సేవలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించడం సంబంధిత అధికారుల బాధ్యత అని తెలిపారు.

""మత సంప్రదాయాలకు అనుగుణంగా సేవలు అందించాలి.""హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు వారి సంప్రదాయాలకు అనుగుణంగా గౌరవప్రదమైన అంత్యక్రియల సేవలు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. హిందూ సంప్రదాయం ప్రకారం అవసరమైన అంత్యక్రియల సామగ్రితో పాటు నాలుగు డప్పుల ఏర్పాటు, క్రైస్తవ సంప్రదాయం ప్రకారం శవపేటికతో పాటు అవసరమైన ఇతర ఏర్పాట్లు, ముస్లిం సంప్రదాయం ప్రకారం సమాధి తవ్వకం, కఫన్ వస్త్రం తదితర సేవలు సంబంధిత టెండర్ నిబంధనల ప్రకారం అందుతున్నాయా లేదా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

**టెండర్‌లో పేర్కొన్న సేవలు, సరఫరా చేయాల్సిన సామగ్రి**

వాటి పరిమాణం, నాణ్యత, సేవల నిర్వహణ బాధ్యతలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి నిర్ధారించాలని సూచించారు. అంతిమ యాత్ర వాహనాల వినియోగం, ప్రయాణ వివరాలు, డీజిల్ ఖర్చుల విషయంలోనూ స్పష్టమైన విధానం ఉండాలని, లబ్ధిదారుల కుటుంబాలపై అనవసరమైన అదనపు ఆర్థిక భారం పడకుండా చూడాలని కోరారు.

2019 నుంచి ఇప్పటివరకు రికార్డుల ఆధారంగా విచారణ జరపాలి. ఈ పథకం అమలు తీరును 2019 నుంచి ఇప్పటివరకు సమగ్రంగా పరిశీలించాలని బండి శ్రీనివాస్ శ్రీ సన్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇందుకోసం లబ్ధిదారుల వివరాలు, అందించిన సేవల రికార్డులు, సరఫరా బిల్లులు, చెల్లింపుల వివరాలు, టెండర్ పత్రాలు, ఒప్పందాలు, వాహనాల డీజిల్ లాగ్‌బుక్‌లు, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేయాలని సూచించారు.

అవసరమైన చోట్ల పథకం ద్వారా సేవలు పొందిన కుటుంబాలను నేరుగా సంప్రదించి, వారికి అందిన సేవలు, సరఫరా చేసిన సామగ్రి, సేవల కోసం ఏవైనా అదనపు మొత్తాలు చెల్లించారా అనే అంశాలపై వివరాలు సేకరించాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత రికార్డులు, లబ్ధిదారుల సమాచారం పరస్పరం సరిపోల్చడం ద్వారా పథకం వాస్తవ అమలు తీరును నిర్ధారించాలని పేర్కొన్నారు. టెండర్లు, ఒప్పందాలపై సమీక్ష --- లోపాలు నిర్ధారణైతే చర్యలు

ప్రస్తుతం అమలులో ఉన్న టెండర్ల గడువు, ఒప్పందాల నిబంధనలు, సేవల బాధ్యతలు, పర్యవేక్షణ వ్యవస్థను సమీక్షించాలని ఆయన కోరారు. విచారణలో ఏవైనా ఉల్లంఘనలు, సేవల్లో లోపాలు లేదా చెల్లింపులకు సంబంధించిన అవకతవకలు ఉన్నట్లు ఆధారాలతో నిర్ధారణైతే, సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవసరాన్ని బట్టి నిబంధనల ప్రకారం కొత్త టెండర్ల ప్రక్రియను చేపట్టి, సేవల నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు.

**"""ప్రజాధనం ప్రజల కోసమే వినియోగించాలి"""**

ప్రజలు తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో అంత్యక్రియల ఏర్పాట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని బండి శ్రీనివాస్ శ్రీ సన్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు ప్రయోజనం అర్హులైన కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరినప్పుడే నెరవేరుతుందని పేర్కొన్నారు.

"""అంతిమ యాత్ర -- ఆఖరి సఫర్""" పథకం విషయంలో ఎవరి మీదా ముందస్తుగా ఆరోపణలు చేయడం తమ ఉద్దేశం కాదని, అందుబాటులో ఉన్న రికార్డులు, వాస్తవాలు, లబ్ధిదారుల అనుభవాల ఆధారంగా పారదర్శకమైన విచారణ జరగాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ఫిర్యాదుపై విచారణకు తగిన చర్యలు చేపట్టి, పథకం అమలు తీరును సమీక్షించి, లోపాలు నిర్ధారణైతే నిబంధనల ప్రకారం సరిదిద్దే చర్యలు తీసుకోవాలని బండి శ్రీనివాస్ శ్రీ సన్ విజ్ఞప్తి చేశారు. అలాగే, విచారణ ఫలితాలు, తీసుకున్న చర్యలను వర్తించే నిబంధనల ప్రకారం వెల్లడించి, ప్రజల్లో పథకంపై విశ్వాసాన్ని పెంపొందించాలని కోరారు.

# అయోధ్య బాలరాముడి ప్రతిమను
# ఎంపీ డీకే అరుణమ్మకు అందజేసిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

**శ్రీరాముడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలి**

**బీజేపీ నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**



**షాద్‌నగర్, అక్షిత ప్రతినిధి:** ఇటీవల అయోధ్య శ్రీరామజన్మభూమిని దర్శించుకుని బాలరాముడి ఆశీస్సులు పొందిన బీజేపీ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గారు, షాద్‌నగర్ పర్యటనకు విచ్చేసిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను శాలువాతో సత్కరించి, అయోధ్య బాలరాముడి పవిత్ర ప్రతిమను అందజేశారు.

ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీరామచంద్రుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు..

# పోలీస్ కమీషనరేట్ కేంద్రంలో ఘనంగా దసరా వేడుకలు

**ఆయుధ, జమ్మి, వాహన పూజల్లో కరీంనగర్ పోలీస్ కమీషనర్ - గౌష్ ఆలం**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కమీషనరేట్ కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు దసరా పండగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ , జమ్మి మరియు వాహన పూజా కార్యక్రమాల్లో పోలీసు కమీషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ కమీషనరేట్ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. కమీషనరేట్ ప్రజలంతా, ఆయురారోగ్యాలతో ఉండాలని పోలీసు కమీషనర్ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ రిజర్వు ఇన్స్పెక్టర్లు జానీమియా, శ్రీధర్ రెడ్డి , కిరణ్ కుమార్ లతో పాటు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# నేలకొండపల్లి మండలంలో డిజే సౌండ్‌తో మహిళ మృతి

**ఖమ్మం జిల్లాలో డీజే సౌండ్స్‌తో మరో వ్యక్తి మృతి... పట్టించుకోని అధికారులు**



**ఖమ్మం /అక్షిత బ్యూరో:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం చెరువుమాదారం గ్రామంలో బతుకమ్మ సంబరాల్లో విషాదం చోటు చేసుకుంది.

విపరీతమైన డిజే సౌండ్ తో యలగాల భారతి (56) అనే మహిళ గుండె పోటు తో మృతి చెందారు. ఆదివారం రాత్రి గ్రామంలో నాలుగు డిజేలతో హంగామా సృష్టించిన బతుకమ్మ సంబరాల నిర్వాహకులు. నేలకొండపల్లి మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా డీజే ల మోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల పేరుతో సరదాల పేరుతో కొందరు ఆకతాయిలు గంజాయి బ్యాచ్ లు తోడై ఫుల్ బేస్ తో డీజే లతో ప్రజలను తీవ్రగా ఇబ్బంది పెడుతున్నారు. ఆయన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్న పిల్లలు పేషెంట్లు గుండె సంబంధిత వ్యాధుల కలవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో కొద్ది నెలల క్రితం ఒక వ్యక్తి మృతి చెందగా మరోసారి నేలకొండపల్లి మండలంలో డీజే సౌండ్స్ దాటికి మహిళా మృతి చెందటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫంక్షన్లలో ఉత్సవాలలో డీజే ను పూర్తిగా నిషేధించాలని ప్రజలు కోరుతున్నారు.

# నిరుపేద క్రీడాకారిణికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** నిరుపేద కుటుంబంలో పుట్టి స్వశక్తితో ఎదుగుతున్న క్రీడాకారిణికి మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 50వేల రూపాయల ఆర్థిక సహాయంను అందజేసి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

ఎస్ జి ఎఫ్ ఐ స్కూల్ గేమ్ ఫ్రీడేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ టైక్వాండో గేమ్స్ జమ్మూ కాశ్మీర్ శ్రీనగర్ లో నిర్వహిస్తున్న నేషనల్స్ కి చౌటుప్పల్ మున్సిపల్ 14 వ వార్డు కు చెందిన నియోజిత అనే క్రీడాకారిని సెలెక్ట్ కావడం జరిగింది. వాళ్ల ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనందున స్థానిక కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 50వేల రూపాయలు తక్షణ సహాయంను క్రీడాకారిణి నియోజితకు అందజేసి జరగబోయే క్రీడల్లో విజేతగా తిరిగి రావాలని, నియోజవర్గానికి, తల్లిదండ్రులకు, తోటి బాలికలకు స్ఫూర్తిగా నిలవాలని ఆశీర్వదించారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే చేయూత ఫౌండేషన్ లక్ష్యం

**ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



నడిగూడెం,అక్షిత న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి తగిన ప్రోత్సాహం అందించడమే చేయూత ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొల్లు పాపయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా కబడ్డీ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వయంగా కబడ్డీ ఆడి వారిని ప్రోత్సహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కబడ్డీ పోటీల నిర్వహణకు సహకరించిన దాతలను, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను చేయూత ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి టీఎస్ఎ స్టేట్ ప్రెసిడెంట్ నలమాధ శ్రీకాంత్ యాదవ్ ఫౌండేషన్ సభ్యులు చిత్తలూరి అనిల్ మండల సమన్వయ సమితి సభ్యులు అనంతుల ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షుడు భువనగిరి ఉపేందర్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి కాసాని సతీష్, వార్డు సభ్యురాలు దున్న మనీషా, బీఆర్ఎస్ నాయకులు అనంతుల మహేష్, పోలేపల్లి వెంకటేశ్వర్లు, నల్లమాద నారాయణరావు, మేకల గంగరాజు, ఎస్కె జలీల్, ఎండీ రఫీ, మౌలానా, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, చేయూత ఫౌండేషన్ సభ్యులు మేకల వీరబాబు మేకల సాయి శనగని కరుణాకర్ శ్రీరాముల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశానికి దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



రామన్నపేట అక్షిత ప్రతినిధి: నకిరేకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ జమీరుద్దీన్, మాజీ ఎంపీటీసీ వనం చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొడ్డు సురేందర్‌రావు కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రామన్నపేట పట్టణ, మండల ప్రజలందరూ విజయదశమి పండుగను సుఖశాంతులతో, సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషం, ఐశ్వర్యం నింపాలని కోరుకున్నారు. ప్రజలందరూ ఐకమత్యంతో, సోదరభావంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆయన అన్నారు.

# గ్రేవ్, పోక్సో కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం వద్దు!

**పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి**

**గంజాయి నిర్మూలనకు నిఘా ముమ్మరం చేయాలి**

**నిర్మల్ సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయ తనిఖీలో ఎస్పీ జి.జానకి షర్మిల**



నిర్మల్,అక్షిత ప్రతినిధి అక్టోబర్ 19 : తీవ్రమైన నేరాలు, పోక్సో కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.

**రికార్డుల తనిఖీ.. కేసులపై సమీక్ష**

పోలీస్ శాఖ వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం నిర్మల్ సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని ఎస్పీ తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఆమెకు డీఎస్పీ పి. శ్రీనివాస్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కార్యాలయంలోని రికార్డులు, క్రైమ్ రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు.

దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ కేసులు, ట్రయల్ దశలో ఉన్న కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను సమీక్షించారు. ప్రతి కేసులో నిర్దేశిత ప్రామాణిక విధానాలు (ఎస్ఓపీ) పాటిస్తూ పక్కా ఆధారాలు సేకరించాలని, దర్యాప్తులో నాణ్యత పాటించి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు.

**పోలీస్ స్టేషన్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ**

కార్యాలయాల్లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ ఫైళ్లు, రికార్డులను క్రమపద్ధతిలో నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్లను తరచూ తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. రౌడీషీటర్లు, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.

**గంజాయి, సైబర్ నేరాలపై అప్రమత్తం**

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్పీ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, ఇతర సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ తనిఖీలో డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, సత్యనారాయణ, కృష్ణ, ఎస్ఐ లింబాద్రి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

## అక్టోబర్ 25..26 తేదీల్లో జరుగు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు**



కల్వకుర్తి అక్షిత ప్రతినిధి: సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అక్టోబర్ 25 26 తేదీలలో చేపట్టిన చలో హైదరాబాద్ మల్టిపుల్ డేస్ ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు కార్మికుల కోరారు సోమవారం ఆయన కల్వకుర్తి పట్టణంలో చలో హైదరాబాద్ గోడపత్రికను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటిత అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనాయని ఆయన విమర్శించారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లుగా విభజించి ప్రభుత్వ రంగ సంస్థల్లో నిర్వీర్యం చేసి కార్మిక హక్కులను కాల రాస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలను పెంచకుండా కార్మిక శ్రమను దోచుకోవడానికి పెట్టుబడిదారులకు స్వేచ్ఛను కల్పించిందని అన్నారు కేంద్ర ప్రభుత్వ సంస్థ సంస్థల్లో కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ప్రభుత్వ అనుకూల సంఘాలకు అవకాశం కల్పిస్తుందని ఆయన ఆరోపించారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు కాంట్రా క్ట్ ఔట్సోర్సింగ్ స్కీం వర్కర్స్ గా పనిచేస్తున్న కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తుందని అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి అక్టోబర్ 25 26 వ తేదీలలో హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో జరుగు మల్టిపుల్ డేస్ మహాధర్నాను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు ఈ కార్యక్రమంలో ఏపీ మల్లయ్య చెన్నయ్య సివిల్ సప్లై గోదాం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య సిఐటియు నాయకులు లక్ పతి యాదయ్య బీరయ్య నరేష్ పర్వతాలు కృష్ణ ఎల్ఐసి యూనియన్ నాయకులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆయుధపూజతో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో దసరా శోభ...

**పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు...**

**జమ్మి మొక్క నాటిన ఎస్పీ జానకి షర్మిల...**



నిర్మల్, అక్టోబర్ 19 (అక్షిత ప్రతినిధి): దసరా నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీస్ ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీస్ వాహనాలకు వాహనపూజ చేసి, హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో ఆయుధాలు, వాహనాలు విధి నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆయుధపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. నిర్మల్ జిల్లా ప్రజలతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు దసరా, నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు...

# చెడుపై మంచి గెలిచిన వేళ...

**జమ్మి ఆకుతో బంధాలు బంగారమైన వేళ**

**మనసున్న మనిషి బంగారం కంటే ఎక్కువ..**

**నేడు విజయదశమి సంబరం..**





**అదిలాబాద్/ ఇచ్చోడ అక్షిత న్యూస్ :** దసరా వచ్చిందంటే చాలు.. పల్లె మొత్తం పండుగ వాతా వరణం.. తెల్లవారుజామునే లేచి, పెద్దల నుంచి యువ తి, యువకులు కొత్త బట్ట లు వేసుకోవడం.. సాయం త్రం పూట డప్పు చప్పుళ్ళ తో శోభమయంగా వెళ్తూ జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేయడం సంప్ర దాయకంగా వస్తున్న ఆచా రం. చేతిలో జమ్మి ఆకులతో పెద్దల ఇంటి ముందు క్యూ కట్టడం.. వారి వద్ద నుంచి ఆశీర్వాదాలు తీసుకోవడం.. చేతిలో చేయి కలుపుతూ.. ఇద్దరూ ఒకరికొకరు ఆలిం గనం చేసుకోవడం వంటి ఆ సీన్ పల్లెల్లో చూడటానికి రెండు కళ్ళు చాలవు. అసలు దసరా అంటేనే జ్ఞాపకాల పండుగ. ఏడాది పొడుగునా ఎక్కడెక్కడో ఉన్న పిల్లలందరూ ఇంటికి చేరుకుని, పెద్దల కాళ్లకు నమస్క రించి "దండం తాతయ్య", "దండం అమ్మమ్మ" అంటే, ఆ ముసలి చేతులు జమ్మి ఆకును బంగారంలా ఇచ్చి తలపై పెట్టి ఆశీర్వదించే ఆ క్షణం.. అంతకు మించిన ఆస్తి ఇంకేముంటుంది..? ఆశ్వయుజ శుద్ధ దశమి రోజున జరుపుకునే విజయ దశమి పండుగ మన రాష్ట్రంలో అత్యంత వైభ వంగా జరుపుకుంటారు. దీనిని దసరా అని కూడా అంటారు. నవరాత్రులు ముగిసిన తర్వాత వచ్చే ఈ పండుగకు ఎంతో విశిష్టత ఉంది.

పండుగ వెనుక కథ : రామాయణం ప్రకారం రావణా సురుడి చెరలో ఉన్న సీతమ్మను విడిపిం చేందుకు శ్రీ రాముడు రావణుడితో 9 రోజులు యుద్ధం చేసి, 10వ రోజు అయిన విజయదశమి రోజున రావణుడిని సంహరించాడు. చెడుపై మంచి సాధించిన విజ యాని కి గుర్తుగా ఈ రోజును జరుపుకుంటారు. మహిషాసురుడు అనే రాక్షసుడితో దుర్గాదేవి 9 రోజులు పోరాడి, 10వ రోజు సంహరించిందని పురా ణాలు చెబుతున్నా యి. అందుకే దీనిని "మహిషా సుర మర్దిని విజయం" గా కూడా చెబుతారు.

దసరా విశిష్టత జమ్మి చెట్టు పూజ : ఈ రోజున పాండ వులు అజ్ఞాతవాసానికి వెళ్తూ తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై దాచారని, తిరిగి విజయదశమి రోజునే తీసుకున్నారని నమ్మకం. అందుకే ఈ రోజు జమ్మి చెట్టుకు పూజ చేసి, ఆ ఆకులను బంగారంగా భావిం చి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటారు. రైతులు తమ వ్యవసాయ పనిముట్లను, వాహనదా రులు తమ వాహనాలను, వ్యాపారులు తమ దుకా ణాలను శుభ్రం చేసి పూజ లు చేస్తారు. ఎంతటి చెడై నా, చివరికి మంచే గెలుస్తుం దని, ధర్మమే నిలుస్తుందని ఈ పండుగ మనకు సందే శాన్ని ఇస్తుంది.

**పాలపిట్ట దర్శనం కోసం పరుగులు..**

విజయ దశమి రోజున పాల పిట్టను చూడటం అత్యం త శుభప్రదంగా భావిస్తారు. దీని వెనుక ఒక పురాణ కథ ఉంది. పాండవులు అజ్ఞాత వాసం ముగించుకుని, జమ్మి చెట్టుపై దాచిన తమ ఆయుధాలను తిరిగి తీసు కునే సమయంలో వారికి మొదటగా పాలపిట్ట దర్శన మిచ్చిందని, అప్పటి నుంచి వారికి విజయాలు వరించా యని నమ్మకం. అందుకే దసరా రోజున పాల పిట్ట కనిపిస్తే విజయం, శుభం కలుగుతుందని భావి స్తారు. దసరా రోజు ఉదయాన్నే తూర్పు దిక్కుగా పాల పిట్ట వెళ్తూ కనిపిస్తే ఆ సంవత్స రం అంతా మంచి జరుగు తుందని నమ్ముతారు. పాల పిట్ట తెలంగాణ రాష్ట్ర పక్షి కూడా. నీలం రంగు రెక్కల తో చాలా అందంగా ఉంటుంది. రైతులకు కూడా ఈ పిట్ట మేలు చేస్తుంది. పంటలను పాడుచేసే పురు గులను తింటుంది. అందుకే దసరా రోజున ప్రతి ఒక్కరూ తెల్లవారు జామునే లేచి పాలపిట్ట కోసం ఎదురు చూస్తారు. ఎందుకంటే పాలపిట్ట కనిపిస్తే ఆ ఏడా దంతా విజయ మే విజయం అని నమ్మకం. పాండవులకే విజయం తెచ్చిన పిట్ట, మన కు తేకుండా ఉంటుందా..? అని నమ్మకం. దర్శనం దొరికితే ఆ ఏడాది విజయ వంతం అవుతుందని సంబరపడతారు.

**ఆకు కాదు.. అది ఆప్యా యత..**

ఈ రోజుల్లో బంగారం కొన డం కష్టమే, కానీ జమ్మి ఆకు ను "బంగారం" అని ఇచ్చిపు చ్చుకోవడం వెనుక ఉన్నది డబ్బు కాదు .. అది మనిషి మనసు. "నువ్వు బంగారం లాంటి వాడివి" అని చెప్పే అందమైన సంప్రదాయం ఇది. జమ్మి ఆకు బంగారం... పెద్దల ఆశీర్వాదం అంతకు మించిన బంగారం.. పాలపిట్ట దర్శనం.. అల నాటి సంప్రదాయానికి నేటికీ చెక్కుచెదరని గౌరవం.. నిజ మైన దసరా అంటే రావణు డిని కాల్చడం కాదు.. మనలో ఉన్న కోపం, ఈర్ష్య, అహంకారాన్ని కాల్చేయడం. అప్పుడే పండుగకు అర్థం. ఈ దసరాకి జమ్మి ఆకుతో పాటు, ఆప్యాయతతో.. ఒకరికొకరు ప్రేమను కూడా పంచుకుందాం.

## ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

**దసరా పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి..**

**7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ చౌటుప్పల్ పురపాలక ఏడవ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత పెంపొందాలని వారు ఆకాంక్షించారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి దసరా కానుకగా దుస్తుల పంపిణీ

**సిబ్బంది సేవలు అభినందనీయం-**

**సర్పంచ్ మేరిగ భారతమ్మ గోపాల్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** మండలంలోని చౌదర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య సిబ్బంది,వాటర్ మెన్,విద్యుత్ సిబ్బందికి దసరా పండుగను పురస్కరించుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ మేరిగ భారతమ్మ గోపాల్ ఉపసర్పంచ్ తడిసిన జ్యోతి ప్రదీప్ రెడ్డి,లు దుస్తులను కానుకగా పంపిణీ చేశారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేతుల మీదుగా సిబ్బందికి దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మెరిగ భారతమ్మ గోపాల్ మాట్లాడుతూ..గ్రామ అభివృద్ధిలో,పరిశుభ్రత పరిరక్షణలో పంచాయతీ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని,వారు అందించే సేవలు అభినందనీయమని అన్నారు.రాత్రి,పగలు తేడా లేకుండా గ్రామంలో పారిశుధ్య పనులు,త్రాగునీటి సరఫరా,వీధి దీపాల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో సిబ్బంది కృషి చేస్తున్నారని,వారి సేవలను గుర్తించి ప్రతి పండుగకు ఇలాంటి కానుకలు అందజేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.దసరా పండుగను సిబ్బంది కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం సిబ్బంది సర్పంచ్ కు,పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్లమ్మ,తడిసిన సుమతమ్మ,సప్పిడి గణేష్,చంద్రశేఖర్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శి మహేందర్,అంజి,శివకుమార్,గ్రామ పెద్దలు,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు పెంచాలి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ విజ్ఞప్తి**




**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** తెలంగాణలో ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలంటే విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి పునరాలోచన చేసి, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల సంఖ్యను పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యా ప్రమాణాలు, పరిశోధన రంగాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు మేధావులను తయారు చేసే కేంద్రాలని, అక్కడ నాణ్యమైన బోధన, పరిశోధనలకు తగిన సంఖ్యలో అధ్యాపకులు ఉండటం ఎంతో అవసరమని తెలిపారు. మేధావుల ఆలోచనలు, పరిశోధనలు ప్రభుత్వ విధానాల రూపకల్పనకు, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని వివరించారు.

ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం 429 పోస్టులకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను పెంచాలని కోరారు. అదనంగా మరో 1,000 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను మంజూరు చేసి, మొత్తం నియామకాల సంఖ్యను 1,500కు మించకుండా కాకుండా, అవసరాలకు అనుగుణంగా మరింత విస్తృతంగా సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు.

యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు తెలంగాణను విద్యా, పరిశోధన, సాంకేతికత తదితర రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ ఎన్. అశోక్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అన్ని రంగాలు అభివృద్ధి చెందాలంటే మేధావుల భాగస్వామ్యం అవసరమని, అందుకు ఉన్నత విద్యా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

కాబట్టి ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీపై మరోసారి పునఃసమీక్ష నిర్వహించి, విశ్వవిద్యాలయాల అవసరాలకు అనుగుణంగా పోస్టుల సంఖ్యను పెంచి, తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి తోడ్పడాలని డాక్టర్ ఎన్. అశోక్ ముఖ్యమంత్రిని కోరారు.

# ఔషధ ఎక్స్పైరీ తేదీ క్షుణ్ణంగా పరిశీలించాలి

## రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు రవీంద్ర నాయక్



**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ బి. రవీంద్రనాయక్ ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవుట్ పేషెంట్ విభాగం, ల్యాబొరేటరీ, ఫార్మసీ, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫార్మసీ యందు మందుల నిల్వలను క్రమ పద్ధతిలో పెట్టుకోవాలి అని అన్నారు. రాబీస్ నివారణ కు సీరం వ్యాక్సిన్ నిల్వ ఉంచుకోవాలి అని అన్నారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ సిస్టమ్ పాటించాలి అని, ఐ ఎల్ ఆర్ టెంపరేచర్ రికార్డ్ చేయాలి అన్నారు. ఎక్స్పైర్ తేది తేదీని వ్యాక్సిన్ డెలివరీ ముందు పరిశీలించాలి అన్నారు.

ప్రోగ్రాం వైజ్ గా ప్రోగ్రాం అధికారులతో కూడా సమీక్ష నిర్వహించి ప్రతి ప్రోగ్రాం పెర్ఫార్మెన్స్ ను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. లెప్రసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్ కార్యాచరణ వివరాలు పరిశీలించారు. హై రిస్క్ గర్భిణీలను, టిఫ్ఫా స్కాన్ లో అబ్నార్మలిటీస్ ఉన్న వారిని, ఎనీమియా వున్న గర్భిణీలను ఫాలో అప్ చేయాలి అన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా కృషి చేయాలని, వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని, ఆసుపత్రిలోని అన్ని విభాగాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని, రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రతి ఆరోగ్య సూచికలో మెరుగైన ప్రగతి సాధించాలని సూచించారు. ఎన్ ఎస్ వి కుటుంబ నియంత్రణ కార్యక్రమంలను, సాధారణ ప్రసవం లను చేయాలి అన్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, డిప్యూటీ అధికారి డాక్టర్ ఐ. ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# దేదినేనీపల్లి గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కారం

## గ్రామ సర్పంచ్ గౌసుద్దీన్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేదినేనీపల్లి గ్రామంలో గత పది సంవత్సరాల నుండి విద్యుత్ సమస్య ఉండడంతో ఇటీవల గ్రామ సర్పంచ్ గౌసుద్దీన్ చొరవతో విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దేదినేనీపల్లి మరియు దేదినేనీపల్లి తండా గ్రామాలలో విద్యుత్ ఏవి ఆన్ ఆఫ్ స్విచులు అమర్చారు. విద్యుత్ ఏవి ఆనఫ్ స్విచ్లు లేకపోవడం వల్ల గ్రామంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేదని వారు సూచించారు . ఇటీ సమస్య విద్యుత్ అధికారులు సహకారంతో పరిష్కరించడం జరిగిందని సర్పంచి తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులకు గ్రామ సర్పంచ్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్మెన్ కుర్మయ్య శివారెడ్డి తదితరులున్నారు.

# నేటి ప్రజావాణికి 13 ఫిర్యాదులు..

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి,

## జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, డీ.ఆర్.ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 13 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండలంలోని జింకురాం తండా గ్రామ సర్పంచ్ గూగులోత్ శ్రీనివాస్--సునీతల వదిన గూగులోత్ కవిత అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హామ్య నాయక్, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్లి మహేందర్ రెడ్డి, దుబ్బ తండా సర్పంచ్ గోపాల్ నాయక్ తదితర స్థానిక నాయకులు పాల్గొని మృతురాలికి నివాళులర్పించారు.

# తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ

## ఐర్లాండ్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**యాదాద్రి భువనగిరి /అక్షిత బ్యూరో:** ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌లో తెలంగాణైట్స్ ఆఫ్ ఐర్లాండ్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.

ఈ వేడుకలను విజయవంతం చేయడంలో 50 మంది వాలంటీర్లు, స్పాన్సర్లు దాతలు, ప్రస్తుత ఫోకల్స్ సుమంత్ చావా, రాజా రెడ్డి తాటిపర్తి ఎంతో ఉత్సాహంగా పాల్గొని కీలక పాత్ర పోషించారు. విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.దుర్గామాత పూజతో ప్రారంభమైన ఈ వేడుకల్లో, మన తెలంగాణ ఆడబిడ్డలు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, బతుకమ్మ చుట్టూ ఆడిపాడుతూ సందడి చేశారు. మన భావితరాలైన చిన్నారులు సైతం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిస్తూ ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**స్వర్గీయ శ్రీ ప్రభోధ్ రెడ్డి మేకల కి ఘన నివాళి**

13 సంవత్సరాల క్రితం ఐర్లాండ్‌లో బతుకమ్మ వేడుకలకు అంకురార్పణ చేసి, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు బాటలు వేసిన స్వర్గీయ ప్రభోధ్ రెడ్డి మేకల ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా స్మరించుకున్నారు.

ఆయన చేసిన నిస్వార్థ సేవలను, తెలంగాణ సంస్కృతి పట్ల చూపిన అపారమైన ప్రేమను, అంకితభావాన్ని గుర్తుచేసుకుంటూ తెలంగాణైట్స్ ఆఫ్ ఐర్లాండ్ (టి ఓ ఐ)సంస్థ తరఫున ఘనంగా నివాళు లర్పించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

**మన సంస్కృతి మన గర్వం -- మన బతుకమ్మ మన ఆత్మగౌరవం**

దేశాలు మారినా, దూరాలు పెరిగినా తెలంగాణ సంస్కృతి పట్ల మన ప్రేమ, అనుబంధం ఎన్నటికీ చెరిగిపోవని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

# టి.జి.పి.ఎస్.సి ఆన్‌లైన్ సీబీఆర్‌టీ పరీక్షలను

# పకడ్బందీగా నిర్వహించాలి

**టి జి.పి ఎస్.సి .చైర్మన్ బుర్ర వెంకటేశం**



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** ఈ నెల 24, 26 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి.జి.పి.ఎస్.సి) నిర్వహించే అసిస్టెంట్ సైంటిస్ట్ గ్రేడ్–××, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) నియామక పరీక్షలను తొలిసారిగా ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సి.బి.ఆర్.టి) విధానంలో నిర్వహిస్తున్నందున, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. జిల్లాల వారీగా చేపట్టిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ హాజరయ్యారు.

ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, కంప్యూటర్ ఆధారిత నియామక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించి, సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, ఆర్టీసీ రవాణా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించే ముందు క్షుణ్ణంగా తనిఖీ (ఫ్రిస్కింగ్) చేయాలని, మొబైల్ ఫోన్లు, అనుమతి లేని ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి తీసుకెళ్లకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో వ్యవహరించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగింపు వరకు అభ్యర్థుల హాజరు, పరీక్షల నిర్వహణ, ముగింపు వివరాలతో కూడిన నివేదికలను ఎప్పటికప్పుడు సేకరించాలని తెలిపారు.




పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ హరిప్రియ సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రీనివాసులు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటం

**రాష్ట్ర ఎన్ హెచ్ ఎం జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్**
**డాక్టర్ టి భరత్ కుమార్**



**వరంగల్, అక్షిత బ్యూరో:** నగరంలోని పోచం మైదానం జంక్షన్ లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది ఈ ఈ శిబిరంలో డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను నిరసన కార్యక్రమం చేపట్టింది కేవలం ఆత్మగౌరం కోసం మన ఉద్యోగ భద్రత కోసం మన పిల్లల భవిష్యత్ కోసం చేస్తున్న పోరాటం అని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో సేవలందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నిండాలని మన న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం లభించాలని కోరుకుంటూ మన నిరసనను శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వానికి తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ అర్చన డాక్టర్ మోహన్ రావు డాక్టర్ రవీందర్ అంజి డాక్టర్ హుస్సేన్ వీసీ సీఎం రవీందర్ సుల్తానా మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాలి



**వరంగల్, అక్షిత బ్యూరో:** జాతీయ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత, భీమా సౌకర్యం, జీతాల పెంపు, మెటర్నరీ సెలవులు లాంటి ఉద్యోగుల న్యాయబద్ధమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం ఎందుకు సానుకూలంగా స్పందించడం లేదని ప్రశ్నించినారు. 10 సంవత్సరాలుగా ఎలాంటి వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా, పి.ఆర్.సి వర్తింపజేయకుండా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకి ప్రభుత్వం అన్యాయం చేస్తుందని అభిప్రాయపడినారు.

## గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణి

**సిబ్బంది సేవలు అబినదనియం**
**సర్పంచ్ భైరం లక్ష్మి -కృష్ణ**



**త్రిపురారం అక్షిత న్యూస్:** త్రిపురారం మండలం లో దసరా ఉత్సవాల్లో భాగంగా త్రిపురారం సర్పంచ్ భైరం లక్ష్మి కృష్ణ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తువులు పంపిణి చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కార్మికులు ఎల్లపుడు గ్రామ పరిశుభ్రత కొరకు పాటుపడాలని, అదే విదంగా గ్రామ ప్రజలు కార్మికులకు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కార్యదర్శి రాజేంద్ర కుమార్,పాలకవర్గం

## భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏతో తెలంగాణ

# ఫార్మా, వస్త్ర పరిశ్రమలకు ప్రోత్సాహం

**తెలంగాణ నుంచి న్యూజిలాండ్‌కు వ్యవసాయ,ఆహార ఉత్పత్తుల ఎగమతుల ప్రారంభం...**

**అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ డాక్టర్ సంపత్ కుమార్**

**చౌటుప్పల్ / అక్షిత న్యూస్ :** భారత్--న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎఫ్‌టీఏ తెలంగాణ ఔషధ, వస్త్ర పరిశ్రమలను బలోపేతం చేయడంతో పాటు, ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగాల్లో మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుందని అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. ఈ ఒప్పందం 2026 అక్టోబర్ 20 నుంచి అమల్లోకి రానుండటంతో, న్యూజిలాండ్‌కు భారత ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోనున్నాయి. దీంతో పలు రంగాల్లో కొత్త ఎగుమతి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయన్నారు.



ఒప్పందం అమలును పురస్కరించుకుని, తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో దండు మల్కాపూర్‌లో ఉన్న టీఐఎఫ్–ఎంఎస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి వ్యవసాయ–ఆహార ఉత్పత్తులతో కూడిన ఎగుమతుల రవాణాను డాక్టర్ సంపత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. భారత ఎగుమతులకు అన్ని సుంకాల విభాగాల్లో సున్నా సుంకంతో ప్రవేశం కల్పించడం ఈ ఒప్పందంలోని ప్రత్యేక లక్షణమని వివరించారు. గతంలో వస్త్రాలు, దుస్తులు, తోలు ఉత్పత్తులపై 10 శాతం వరకు, ఔషధాలు సహా పలు ఇతర రంగాలపై 5 శాతం వరకు ఉన్న సుంకాలు ఇప్పుడు సున్నా కానున్నాయని తెలిపారు. వీటితో పాటు సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, ప్లాస్టిక్, రసాయనాలు, విద్యుత్ పరికరాలు వంటి ఇతర రంగాలు కూడా ఈ ఒప్పందం ద్వారా ప్రయోజనం పొందనున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణకు ఈ ఒప్పందం ప్రాధాన్యతను వివరిస్తూ హైదరాబాద్‌లోని ఔషధ పరిశ్రమతో పాటు రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ ఎక్కువగా విస్తరించినందున ఈ ఒప్పందంతో ఆయా రంగాలకు వాణిజ్య అవకాశాపెరుగుతాయని ఆయన అన్నారు. ఇది తెలంగాణలో పారిశ్రామిక వృద్ధికి, ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీజీఎఫ్‌టీ, అపెడా, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్ నవదుర్గా సన్నిధిలో వైభవంగా మహాయజ్ఞం...

### మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారి దర్శనం భక్తిశ్రద్ధలతో పూజలు...



**లోకేశ్వరం, అక్టోబర్ 19 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామంలోని నవదుర్గా సన్నిధిలో సోమవారం మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. పురోహితుడు రాజేశ్వర్ చారి,ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి గ్రామస్తులు, దుర్గామాత స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని అవతారంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమివ్వడంతో సన్నిధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేదమంత్రోచ్చారణల నడుమ మహాయజ్ఞం కొనసాగగా,పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామంలో భక్తి భావాన్ని చాటిచెప్పిన ఈ మహాయజ్ఞంలో డాక్టర్ సాగర్,మురళి గౌడ్,రమేష్,గణేష్ గౌడ్,చంద్రకాంత్, దంపతులతో పాటు మహేందర్,రాజు,శంకర్, నవీన్, నరేందర్, ముత్యం,భరత్ స్వాములు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు దారుల నుండి 07 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు.

సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 07 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 04, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 03 ,స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

# 'చలో పాఠశాల' కార్యక్రమంతో ఆరోగ్యంపై చైతన్యం.....!

### విద్యార్థులకు చర్మవ్యాధులపై అవగాహన

### మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తా: డాక్టర్ భూమేష్ కుమార్.....!




**ఆర్మూర్, అక్షిత బ్యూరో:** విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ భూమేష్ కుమార్, (ఉస్మానియా హాస్పిటల్ ప్రొఫెసర్, హెడ్ అఫ్ డిపార్ట్మెంట్) సూచించారు. గుత్ప ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన 'చలో పాఠశాల' కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు చర్మవ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ భూమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చర్మంపై దురద, దద్దుర్లు లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

**ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం...!**

విద్యార్థులను చదువులో మరింత ప్రోత్సహించేందుకు ప్రతి తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు డాక్టర్ భూమేష్ కుమార్ తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు ప్రతిభావంతులను ప్రోత్సహించడం తన లక్ష్యమని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమలా దశరథ్ పాల్గొన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు చదువులో ప్రతిభ కనబరిచే వారిని ప్రోత్సహించేందుకు ముందుకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుత్ప,రాంచంద్ర పల్లి సర్పంచులు కమల దశరథ్,తొగారి భూషణ్, గుత్ప జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు దృపతి కుమార్,గిరిరాజ్ గ్రామ ఉప సర్పంచ్ సూరచిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

## గంజాయి అక్రమ విక్రయాలపై కాజీపేట పోలీసుల ఉక్కుపాదం

### ఐదుగురు నిందితుల అరెస్ట్

### రూ.4.25 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం







**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా కొనసాగిస్తున్న పోలీసులు, సోమవారం కాజీపేట రైల్వే స్టేషన్ ముందు ఉన్న ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 500 గ్రాముల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల మొత్తం అంచనా విలువ రూ.4,25,000/- అని తెలిపారు. పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు ా1 రెడ్డబోయిన రాకేష్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చినట్లు తెలిసింది. మిగిలిన నిందితులు ా2 ఆడెపు కిరణ్ నుంచి ా5 మేకల ఖుషి వరకు ఒక్కొక్కరు రూ.2,000/- చొప్పున అందించి, గంజాయిని అధిక ధరకు విక్రయించి లాభాలు పొందాలనే ఉద్దేశంతో కలిసి వ్యవహరించినట్లు పంచనామాలో పేర్కొన్నారు. సోమవారం నాడు గంజాయిని విక్రయించేందుకు కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంతానికి చేరుకున్న నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న గంజాయి మరియు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన కాజీపేట ఎస్‌హెచ్‌ఓ జె. శ్యామ్ సుందర్, ఎస్ఐ మౌనికా రెడ్డి, ఎస్ఐ శివ, ఎస్ఐ యాదగిరి, ఏఏఓ సల్మాన్ పాషా, క్రైమ్ పీసీలు వి. క్రాంతి కుమార్, ఎస్. భరత్ కుమార్, సీహెచ్. శ్రీధర్, అశోక్ తదితర పోలీసు సిబ్బందిని కాజీపేట ఏసీపీ పింగళి పి. ప్రశాంత్ రెడ్డి , సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవితా , వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శ్వేత, ఐపీఎస్ అభినందించారు.

## తాండూరు మండలంలో పైలెట్ రోహిత్ రెడ్డి విస్తృత పర్యటన

### గ్రామగ్రామాన దుర్గామాత మండపాల సందర్శన..

### మహిళలు, యువతతో సందడి



**తాండూరు అక్షిత ప్రతినిధి:** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తాండూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలం లోని సంగెం కలాన్, మల్కాపూర్, ఐనెల్లి, మీట బాప్పల్లి, జిన్‌గుర్తి, సిరిగిరి పేట్, చింతామణిపట్నం గ్రామాల్లో నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామా లకు చెందిన సీనియర్ నాయకులతో సమావేశమై స్థానిక పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు.

పైలెట్ రోహిత్ రెడ్డి గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఆయనను కలుసుకున్నారు. ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ, సందడి చేశారు. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో తాండూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రాకేష్ గౌడ్, మాజీ ఎంపీపీ రామలింగారెడ్డి, సర్పంచ్ కామిని అనిల్, ఉప సర్పంచ్ లంబాడి రమేష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.